క్లుప్తంగా

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పరకాల : దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన పథకంలో భాగంగా మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు తెలిపారు. జూలై 1న ఉదయం 10 గంటలకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. పూర్తి సమాచారం కోసం 9849131050, 9642141539 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

పరకాల: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సోమవారం పరకాల డిపో పరిధిలోని వివిధ మండలాల ప్రజలు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ రవిచందర్ తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు తెలియజేయడానికి 9666919190కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

జై భీమ్ యూత్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

వేలేరు : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన జై భీమ్ యూత్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొయ్యడ జీవన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మారుపాక ధనుంజయ్, ప్రధాన కార్యదర్శిగా బొల్లం ప్రభాకర్, కార్యదర్శిగా శ్యామ్‌కుమార్, కోశాధికారిగా మోతె రాజు, సలహాదారులుగా జోగు ప్రసాద్, సంపత్, శ్రీనివాస్, అశోక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్య వాస్తు శాస్త్రంలో కృష్ణమాచార్యులుకు అవార్డు


కృష్ణమాచార్యులును సన్మానిస్తున్న బాలసుబ్రహ్మణ్య శర్మ, సభ్యులు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరి స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులుకు ఆదివారం విజయవాడలో జరిగిన ఆస్ట్రో క్విజ్ ఫ్యామిలీ సెమినార్‌లో జ్యోతిష్యం, వాస్తుల్లో విశేష సేవలు అందిస్తున్నందుకు ఉత్తమ జ్యోతిష్య వాస్తు శాస్త్రంలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రో క్విజ్ ఫ్యామిలీ అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్య శర్మ కృష్ణమాచార్యులుకు అవార్డు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శాయంపేట గ్రామ ప్రజలు కృష్ణమాచార్యులును అభినందించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి


వజ్రమ్మ(ఫైల్)

దామెర : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఒగ్లాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంచినీళ్ల వజమ్మ(47) ఈ నెల 26న ఉదయం ఒగ్లాపూర్ సమీపంలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో పనిచేసేందుకు వెళ్తుంది. ఈ క్రమంలో టీఎస్ 36 టీ ఏ 5436 నంబర్ గల లారీ గూడెప్పాడ్ నుంచి హనుమకొండకు వెళ్తుంది. పాఠశాల సమీపంలో వజ్రమ్మను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శివకుమారికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ విభాగం పరిశోధకురాలు బైరపాక శివకుమారికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. అట్రాసిటీస్ ఆన్ ఉమెన్ ఇన్ తెలంగాణ యాస్ రెఫ్లెక్టెడ్ ఇన్ కాంటెంపరరీ తెలుగు లిటరేచర్ – ఏ స్టడీ (1911 – 1948) అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శివకుమారికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు. హిస్టరీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సదానందం పర్యవేక్షణలో శివకుమారి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

చినుకు పడితే చిత్తడే..

- బురదమయమవుతున్న రోడ్లు
- సైడ్ కాల్వలు లేక రోడ్లపైనే పారుతున్న మురుగునీరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు


ల్యాదెళ్లలో బురదమయంగా మట్టి రోడ్డు


రోడ్డుపై నిలిచిన మురికి నీరు

దామెర : మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలో అంతర్గత రహదారులు చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారుతున్నాయి. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఇప్పటికీ రోడ్లపైన మురుగు నీరు పేరుకుపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని పలు కాలనీల్లో వర్షం నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. అంతేకాకుండా బాటసారులు కాలుతీసి కాలు వేయని దుస్థితి నెలకొంది. ఇంకా ఎన్నాళ్లు ఈ అవస్థలు పడాలంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి రోడ్లకు తోడు ధ్వంసమైన పాత సీసీ రోడ్లు

గ్రామంలోని అంతర్గత మట్టిరోడ్లు బురదమయంగా తయారవుతున్నాయి. అదే విధంగా కొన్నేళ్ల క్రితం వేసిన సీసీ రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో రోడ్లపై గుంతలు ఏర్పడి నీరు నిలువడంతో బాటసారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

డ్రెయినేజీలు లేక ఇబ్బందులు

గ్రామంలో కొంతమేర సీసీ రోడ్లు నిర్మాణాలు చేసినప్పటికీ పలు చోట్ల సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో రోడ్లపైనే వర్షం నీరు నిలువడంలో చిన్నపాటి వర్షానికే రోడ్లుకాస్తా కుంటలా తయారవుతున్నాయి. దీనికి తోడు ఇళ్లల్లోంచి వచ్చే మురుగు నీరు రోడ్లపై నిలువడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. అదే విధంగా సీసీ రోడ్లు నిర్మాణం చేసే దశలో ఒక బిట్టు పోసిన కొన్ని రోజులకు మరో బిట్టు దానికి సమాంతరంగా పోయకుండా ఎగుడుదిగుడుగా పోయడం మూలంగా నీరు నిలువడంతో పాటు బురద పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటితో దుర్వాసన రావడంతో పాటు దోమలు విపరీతంగా వ్యాప్తిచెంది వ్యాధుల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు.

అధికారులు దృష్టి సారించాలి



గ్రామంలో డ్రెయినేజీలు లేకపోవడంతో రోడ్లపైనే వర్షం నీరు నిలుస్తుంది. దీంతో రోజుల తరబడి మురుగునీరు నిల్వడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది జ్వరాల బారిన పడుతున్నాం. అధికారులు దృష్టి సారించి డ్రెయినేజీలు నిర్మించి నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– అన్నెబోయిన రోహిత్, ల్యాదెళ్ల

విశ్వనాథరెడ్డికి ఘన నివాళి


విశ్వనాథరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్యాంకు అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో సొసైటీ ఏర్పాటు చేసి సంఘం అభివృద్ధికి ఏ.కే. విశ్వనాథరెడ్డి ఎంతో కృషి చేశారని బ్యాంకు అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, సంఘం ఆధ్వర్యంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం విశ్వనాథరెడ్డి విగ్రహానికి, సంఘం సీనియర్ సభ్యులు కటకం లక్ష్మీనారాయణ, మాడిశెట్టి తారాబాయితో కలిసి విశ్వనాథరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సంఘం జనరల్ మేనేజర్ రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు కదారి ఆదామ్, సభ్యులు కనుకయ్య, జయపాల్‌రెడ్డి, భాగ్య, వీరయ్య, రాములు, మూగయ్య, కనుకమ్మ, రవీందర్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, బుచ్చయ్య, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ


షాపులో తనిఖీ చేస్తున్న సీఐ మహేందర్, సిబ్బంది

గీసుకొండ : మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో సీఐ మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల గడువుతోపాటు షాపుల లైసెన్స్, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, తదితరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడారు. డీలర్లు ప్రభుత్వం అనుమతించిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలనే విక్రయించాలని స్పష్టం చేశారు. రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, ఇతర నిబంధనలు పాటించాలని కోరారు. లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అసంపూర్తిగా గ్రామ పంచాయతీ భవనం


అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనం

వేలేరు : మండలంలోని గొల్లకిష్టంపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం ప్రారంభించి మూడేళ్లయినా అసంపూర్తిగానే ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నూతనంగా ఏర్పడిన గొల్లకిష్టంపల్లికి ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో జీపీ భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శంకుస్థాపన చేసి పనులు గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ స్లాబ్ వరకు పనులు చేసి బిల్లులు రావడం లేదని మధ్యలోనే వదిలేశారు. దీంతో మూడేళ్లుగా గ్రామ పంచాయతీ పనుల్లో పురోగతి లేదన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ చూపి బిల్లులు త్వరగా మంజూరు చేయించి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

హన్మకొండ: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దేశ వ్యాప్తంగా జూలై 9 జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాంచందర్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రవాణా రంగ సంస్థను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడానికి 29 చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిందని తెలిపారు. సార్వత్రిక సమ్మెలో అన్ని ట్రేడ్ యూనియన్ల నాయకులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు : మండలంలోని లింగమోరిగూడెం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ బుర్ర శ్రీహరి(44) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులు వేర్వేరుగా మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు మునిగాల సంపత్, అర్థగూడి సతీష్, రుగ్వేద్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు, మాజీ సర్పంచ్‌లు కంజర్ల రమేష్, ఆనందం, స్వామి, నాయకులు దేవదాస్, యాకూబ్, సొసైటీ సీఈఓ సంపత్ ఉన్నారు.

ఆత్మకూరు : మండలంలోని కామారం గ్రామానికి చెందిన మూల కన్నయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, మండల సమన్వయ కమిటీ సభ్యులు కక్కెర్ల రాజు, మార్క రజనీకర్, లక్కర్స్ రాజు, కాసర్ల రాజు, ప్రతాపరెడ్డి, లింగమూర్తి, మొగిలి, పైడి తదితరులు ఉన్నారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పోలీసులు

శాయంపేట : మండలంలోని మాందారిపేట శివారులోని గుట్టల వద్ద సిగరెట్లలో గంజాయి నింపుకొని సేవిస్తున్న వ్యక్తులను పట్టుకున్నట్లు స్థానిక సీఐ రంజిత్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై జక్కుల పరమేశ్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మాందారిపేట శివారులోని గుట్టల వద్ద ఆరుగురు వ్యక్తులు సిగరెట్లు తాగుతుండగా గమనించిన ఎస్సై పోలీస్ వాహనాన్ని ఆపగా నలుగురు యువకులు పారిపోగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారు తాగుతున్న సిగరెట్ ముక్కలను పరిశీలించగా గంజాయి వాసన వస్తున్నట్లు గమనించి విచారించగా కొప్పుల గ్రామానికి చెందిన తరాల శ్రావణ్‌కుమార్, వరంగల్ బాలాజీనగర్ గ్రేస్‌మార్కెట్‌కు చెందిన గంధం శివలుగా తెలిపారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రగ్ చెకింగ్ కిట్టు ద్వారా మూత్రపరీక్ష చేయించగా వారు గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. డ్రగ్స్ (గంజాయి) నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని, యువత ఎక్కడైనా గంజాయి అమ్మినట్లు గానీ, సేవించినట్లుగా అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, గంజాయి సేవించిన వారికి డ్రగ్ చెకింగ్ కిట్టు ద్వారా పరీక్షలు జరిపి వారిపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ రంజిత్‌రావు హెచ్చరించారు.

నోట్‌బుక్స్ పంపిణీ


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న అనితారెడ్డి

హన్మకొండ: ఆశ్రమ, వీధి బాలుర ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద ఆటోడ్రైవర్ల పిల్లలకు హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని స్పందన మానసిక వికలాంగులు, బధిరుల ఆశ్రమంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. రన్ ఆర్గనైజేషన్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కరుకాల అనితా రెడ్డి నోట్‌బుక్స్ అందించారు. కార్యక్రమంలో రన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ప్రియాంక, శ్రీకాంత్, సుచరిత, వసుధ, హరిత, తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

- ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న


జెండాగద్దె నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శాయంపేట : జూలై 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఆదివారం ఎంఎస్పీ మండల అధ్యక్షుడు మామిడి భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ నూతన జెండా నిర్మాణ పనులను సోమన్న, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్‌లు ముఖ్యఅతిథిలుగా పాల్గొని భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన ప్రత్యేక కార్యాచరణను మండలంలోని ప్రతి గ్రామ గ్రామాన అమలు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేసి జూలై 7న ఎమ్మార్పీఎస్ 31వ వార్షికోత్సవాన్ని జన జాతరను మాదిగలు జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడువు ముగిసిన పురుగు మందుల పట్టివేత

- ఎరువుల షాపు యజమానిపై కేసు


మందులను స్వాధీనం చేసుకుంటున్న సీఐ రంజిత్ రావు, ఏఓ గంగాజమున

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామం శ్రీ మల్లికార్జున ఎంటర్ ప్రైజెస్ ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ యాజమాని కాలం చెల్లిన పురుగుల మందులు విక్రయిస్తున్నాడని యజమానిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ రంజిత్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపాక గ్రామంలోని శ్రీ మల్లికార్జున ఎంటర్ ప్రైజెస్‌లో షాపు యజమాని బంక రాజేంద్రప్రసాద్ తన షాపులో కాలం చెల్లినటువంటి పురుగులు మందులు అమ్మడానికి ఉంచగా ఆదివారం మండల వ్యవసాయ అధికారి గంగాజమున, ఏఈఓ సుప్రియ శాయంపేట పోలీస్ సిబ్బందితో కలిసి షాపు తనిఖీ చేశారు. అందులో గడువు ముగిసిన మందులు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ. 9,600 ఉంటుందని తెలిపారు. పురుగుల మందులను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ ఇవ్వగా షాపు యజమాని రాజేంద్రప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మండలంలోని ఫర్టిలైజర్ షాపు యాజమానులు కాలం చెల్లిన మందులు కానీ, నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

‘మన్ కీ బాత్’ని వీక్షించిన బీజేపీ నాయకులు


మన్ కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పొన్నాల రాజు ఇంటి వద్ద ప్రధాన మంత్రి మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నేతలు వీక్షించారు. అనంతరం మొక్కను నాటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల దీన్‌దయాల్, జిల్లా కార్యదర్శి కోటేశ్వర్‌రావు, కోశాధికారి మహేష్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సీనియర్ నాయకులు భాస్కర్, ప్రభాకర్, రవితేజ, ఆనందం, విక్రమ్, కిరణ్, రాజేష్, హరి ప్రసాద్, రమేష్, శ్రీకాంత్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో ఈదుముడి’ని విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫోరం బాధ్యులు

కేయూ క్యాంపస్: తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం (టీఎంజేఎఫ్) ఆధ్వర్యంలో జులై 7న ప్రకాశం జిల్లాలోని ఈదుముడిలో నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీలో ఈదుముడి వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజల న్యాయ హక్కుల కోసం అమరులైన వీరుల త్యాగాలను స్మరించేందుకు చలో ఈదుముడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఫోరం బాధ్యులు తక్కళ్లపెల్లి రాజేందర్, బొల్లెపాక రాజేష్, మైలారపు ప్రేమ్‌కుమార్, కరుణాకర్, అశోక్, పెండ్యాల సుమన్, కుమ్మరి ముకేష్, బొట్ల సదానందం, లంక స్వామి, సిరిసిల్ల అనిల్, కొడెపాక భాస్కర్, ప్రసాద్, రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కమలాపూర్ : 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు


ఎల్కతుర్తి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కమలాపూర్ : మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2000–01 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమతో చిన్నప్పుడు చదువుకున్న బాల్య మిత్రులను కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, జనార్దన్, రవీందర్, గణపతిశర్మ, మధునయ్య, సంపత్, మల్లేశం, కిషన్‌రావు, పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి: భీమదేవపల్లి మండలం ముల్కనూర్‌లో ఆదివారం విశ్వశాంతి విద్యాలయం పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 2010–11 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. విద్యాబోధన నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

హన్మకొండ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుదామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని స్వగృహంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అరెస్టు అక్రమని, ఆయన అరెస్టును ఖండించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన క్రమంలో గురుకులాలు, పాఠశాలల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించాలని విద్యార్థి నాయకులకు సూచించారు. గురుకులాలు, వివిధ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను ఎత్తిచూపుతూ, ఆయా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడుదామన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పార్టీ పరంగా విద్యా కమిటీలను సైతం ఏర్పాటు చేద్దామని తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న కేంద్రీయ విద్యాసంస్థలు, ఇతర విద్యాసంస్థల సాధన కోసం ఉద్యమించాలని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.